డిప్యూటీ సీఎంగా ఉదయనిధి?

● డీఎంకే యువజన విభాగ మహానాడు కాగానే పదోన్నతి!



చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధికి పదోన్నతి లభించనుందా?.. ప్రజల్లో ఆయనకు పెరుగుతున్న ఆదరణ, పార్టీలో పెరుగుతున్న మద్దతుతో తన కుమారుడికి డిప్యూటీ సీఎం పదవి కట్టబెట్టాలని ముఖ్యమంత్రి స్టాలిన్ నిర్ణయించారా?.. త్వరలో జరగనున్న డీఎంకే యువజన విభాగ మహానాడు కాగానే ఈ తంతు జరగనుందా?.. అవుననే అంటున్నాయి డీఎంకేలోని విశ్వసనీయ వర్గాలు. ఈ మేరకు త్వరలోనే ఉదయనిధికి ప్రభుత్వ పాలనా బాధ్యతలు అందనున్నాయి. డీఎంకే యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న ఉదయనిధి గత పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో విస్తృత ప్రచారం చేశారు. ఆయన ప్రచారం నిర్వహించిన నియోజకవర్గాల్లో మంచి ఫలితాలు రావడంతో పాటు 'మాస్ లీడర్'గా గుర్తింపు పొందారు. ఇక డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడిగా ఉదయనిధికి నేతల్లో మంచి ఆదరణ ఉండడంతో పాటు ఆయన తీసుకునే సత్వర నిర్ణయాలు, సమస్యలపై స్పందించే తీరు ప్రజలకు బాగా దగ్గర చేసింది. మంత్రివర్గంలో సాంకేతికంగా ఉదయనిధి స్థానం చివరలో ఉన్నా, మంత్రులంతా ఆయన్ని ముఖ్యమంత్రి తరువాతి స్థానంలోనే చూస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాలకు సీనియర్ మంత్రులు హాజరవుతున్నప్పటికీ ఉదయనిధే ముందు వరుసలో కూర్చోవడంతో పాటు కార్యక్రమానికి ఆయనే నేతృత్వం వహిస్తున్నారు. సీనియర్ మంత్రులు సైతం 'చిన్నవర్' (చిన్నాయన) అంటూ ఉదయనిధిని ముద్దుగా సంబోధిస్తున్నారు.

భవిష్యత్తు దృష్ట్యా...

ఉదయనిధికి మరిన్ని బాధ్యతలు అప్పగించడం మంచిదని సీఎం స్టాలిన్ భావిస్తున్నట్లు తెలిసింది. 'భవిష్యత్తు'ను దృష్టిలో పెట్టుకుని ఆయన ఈ దిశగా యోచిస్తున్నట్లు సమాచారం. ఉదయనిధికి ఉపముఖ్యమంత్రి పదవి కట్టబెడితే, తన తరువాత ఉదయనిధేనన్న భావన పార్టీ క్యాడర్‌కు, ప్రజలకు కూడా వెళ్లాలనేది స్టాలిన్ యోచనగా ఉన్నట్లు తెలిసింది. అందుకే ఉదయనిధికి వరుసగా బాధ్యతలు పెంచుతున్నారు. ఇందులో భాగంగానే క్రీడాభివృద్ధి శాఖ మంత్రిగా వున్న ఉదయనిధి ఇటీవల ఢిల్లీ వెళ్లి ఒంటరిగానే ప్రధానితో రెండుమార్లు భేటీ అయ్యారు. అదే విధంగా పలువురు కేంద్రమంత్రులతోనూ ఆయన సమావేశమై సమస్యల పరిష్కారానికి ప్రయత్నించారు. ఉదయనిధిని ఒంటరిగా ప్రధాని వద్దకు పంపడం, ఆయన రాటుదేలేందుకేనని డీఎంకే వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పుడు తాజాగా పార్లమెంటు ఎన్నికల కోసం తమిళనాడుతో పాటు పుదుచ్చేరిలోని 40 లోక్‌సభ నియోజకవర్గాల్లో ప్రచారం చేసేందుకు ఉదయనిధి సిద్ధమవుతున్నారు. అయితే దానికంటే ముందుగానే సేలంలో నిర్వహించనున్న డీఎంకే యువజన విభాగ మహానాడును విజయవంతం చేయాలని ఆయన గట్టిగా భావిస్తున్నారు. ఇప్పటికే రెండు మూడు మార్లు వాయిదా పడడంతో ఈసారి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ఉదయనిధి సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఆ మహానాడు ముగియగానే ఉదయనిధికి ఉపముఖ్యమంత్రి పదవి కట్టబెట్టాలని స్టాలిన్ భావిస్తున్నట్లు డీఎంకే విశ్వసనీయవర్గాల సమాచారం. దీనిపై ఇప్పటికే కొంతమంది సీనియర్లతోనూ ముఖ్యమంత్రి చర్చించినట్లు తెలిసింది. వారు కూడా మంచి నిర్ణయమని హర్షం ప్రకటించినట్లు సమాచారం. ఇదిలా వుండగా ఒకవేళ ఉదయనిధి డిప్యూటీ సీఎం అయితే పలువురు రాష్ట్ర మంత్రుల శాఖల్లో మార్పులు చేర్పులు జరిగే అవకాశముందని సచివాలయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

పొంగల్ నగదు కానుకపై

వీడిన సస్పెన్స్

రేషన్‌షాపుల్లోనే రూ.1000 పంపిణీ ● సీఎం స్టాలిన్ తీపికబురు

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా పొంగల్ నగదు కానుకపై కొనసాగిన సస్పెన్స్ ఎట్టకేలకు వీడింది. పొంగల్ తయారీకి అవసరమైన సరుకులతోపాటు రూ.1000 నగదును కూడా రేషన్ షాపుల్లోనే పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం ప్రకటించారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. వారం రోజుల క్రితం పొంగల్ సందర్భంగా బియ్యం కార్డుదారులకు చక్కెర పొంగలి తయారీకి అవసరమైన కిలో పచ్చిబియ్యం, కిలో చక్కెర, ఒక చెరకు గడను పంపిణీ చేయడానికి అధికారులు సన్నాహాలు చేపడుతున్నట్లు ప్రభుత్వ ప్రకటన జారీ అయ్యింది. ఆ ప్రకటనలో యేటా చెల్లించే రూ.1000 నగదు కానుక పంపిణీపై ఎలాంటి వివరాలు లేకపోవడంతో ఎనిమిది జిల్లాల్లో వరద పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ నగదు కానుక పంపిణీని ప్రభుత్వం నిలిపివేయనున్నదని రాష్ట్రవ్యాప్తంగా వదంతులు వ్యాపించాయి. అదే సమయంలో పొంగల్ నగదు కానుకపై ప్రకటన చేయని ముఖ్యమంత్రి స్టాలిన్ దూషిస్తూ సామాజిక ప్రసార మాధ్యమాల్లో వీడియోలు కూడా హల్‌చల్ చేశాయి. పొంగల్ నగదు కానుక పంపిణీ అవుతుందో లేదోనని బియ్యం కార్డుదారులంతా అయోమయానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి అందరి అనుమానాలను నివృత్తి చేసేలా పొంగల్ నగదు కానుకను రేషన్‌షాపుల్లోనే పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. పొంగల్ కానుకలతోపాటు యేటా బియ్యం కార్డుదారులకు ఇచ్చే ఉచిత చీరలు, ధోవతులను కూడా అందించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత చీరలు, ధోవతులను సకాలంలో లబ్ధిదారులకు అందించనున్నామని తెలిపారు. కేంద్ర, ప్రభుత్వ ఉద్యోగులు, పన్ను చెల్లింపుదారులు, ప్రభుత్వ రంగ సంస్థలలో పని చేసే వారు, చక్కెరకార్డుదారులు మినహా తక్కిన ఉచిత బియ్యం కార్డుదారులందరికీ పొంగల్ కానుకలు, ఉచిత చీరలు, ధోవతులు పంపిణీ చేయనున్నట్లు ఆయన వివరించారు.



10న కలైంజర్ సాధికారిక నగదు...

1.15 కోట్ల మంది గృహిణులకు కలైజర్ మహిళా సాధికారిక నగదుగా ఇచ్చే రూ.1000ను ఈనెల 10న వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు స్టాలిన్ పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గృహిణులు సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ నగదును నిర్దేశిత తేదీ కంటే ఐదు రోజులు ముందుగానే జమ చేయనున్నట్లు సీఎం తెలిపారు.

19న రాష్ట్రానికి ప్రధాని

పెరంబూర్, జనవరి 5: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 19వ తేదీన రాష్ట్రానికి రానున్నారు. ముందుగా తిరుప్పూర్ చేరుకోనున్న ప్రధాని.. అక్కడ జరిగే బీజేపీ బహిరంగసభలో పాల్గొననున్నారు. 'ఖేలో ఇండియా యూత్ 2024' క్రీడా పోటీలు రాష్ట్రంలో ఈనెల 19న ప్రారంభమై 31వ తేది వరకు జరగనున్నాయి. చెన్నైలో జరగనున్న క్రీడా పోటీలు ప్రారంభోత్సవంలో పాల్గొనాలని ప్రధాని నరేంద్రమోదీని ఢిల్లీలో కలసిన రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి ఆహ్వానం పలికారు. ఈ నేపథ్యంలో, ఖేలో ఇండియా పోటీలు ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు రానున్న ప్రధాని ఆ రోజు ఉదయం తిరుప్పూర్‌కు చేరుకుంటారు. ఈ సందర్భంగా తిరుమురుగన్‌పూండిలో నూతనంగా నిర్మించిన ఈఎస్ఐ ఆసుపత్రిని ప్రారంభించనున్న ప్రధాని.. అనంతరం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. ఇందుకోసం తిరుప్పూర్ పీఎన్ రోడ్డు, ఆండిపాళయం, మాదప్పూర్ తదితర మూడు ప్రాంతాలను పరిశీలిస్తున్న నాయకులు, బహిరంగ సభకు ఒక ప్రాంతాన్ని ఎంపిక చేయనున్నట్లు బీజేపీ దక్షిణ జిల్లా కార్యదర్శి పి.సెంథిల్‌వేల్ తెలిపారు. అలాగే, ప్రధాని వచ్చే సమయం, బహిరంగ సభ ఏర్పాటుకానున్న ప్రాంతాన్ని త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని ఆయన తెలిపారు.



రూ.1933.69 కోట్లతో తాగునీరు, డ్రైనేజీ పథకాలు

ప్రారంభించిన ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నగర పాలన, తాగునీటి సరఫరా శాఖల ఆధ్వర్యంలో రూ.1933.69 కోట్లతో పూర్తయిన పథకాలను ప్రారంభించి, రెండు భూగర్భడ్రైనేజీ పథకాలకు సీఎం ఎంకే స్టాలిన్ శంకుస్థాపన చేశారు. చెన్నై సచివాలయంలో శుక్రవారం ఉదయం ఏర్పాటైన కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పథకాలను ప్రారంభించి, ఆ శాఖల్లో కారుణ్య ప్రాతిపదికన 121 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. చెన్నై మహానగర తాగునీటి సరఫరా, మురుగునీటి తొలగింపు సంస్థ ఆధ్వర్యంలో రూ.204.36 కోట్లతోను, రాష్ట్ర తాగునీటి సరఫరా సంస్థ ఆధ్వర్యంలో రూ.1335.86 కోట్లతో, నగరపాలక నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో రూ.258.11 కోట్లతో, నగర పంచాయతీల సంఘం ఆధ్వర్యంలో రూ.56.94 కోట్లతో, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.78.42 కోట్లతో పూర్తయిన పథకాలను ఆయన ప్రారంభించారు. ఇక చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ. 278.97 కోట్లతో నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ పథకాలకు శంకుస్థాపన చేశారు. స్టాలిన్ ప్రారంభించిన వాటిలో తిరుపత్తూరు జిల్లా జోలార్‌పేట, కందిలి, తిరుపత్తూరు, నాట్రాంపల్లి నగర పంచాయతీలకు తాగునీటి సరఫరా పథకం, తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు యూనియన్ పరిధిలోని నల్లాత్తూరు, ఎన్ఎన్‌కండిగై, పూనిమాంగాడువాసులకు సమగ్రనీటి సరఫరా పథకం, తంజావూరు, కరూరు, ఈరోడ్, తూత్తుకుడి జిల్లాల్లో నిర్మించిన సమగ్రనీటి పథకాలున్నాయి. ఇదే విధంగా ఆలందూరు మండలంలో భూగర్భ డ్రైనేజీ పథకం, మాధవరంలో తాగునీటి పథకం, నెర్‌కుండ్రం గంగైయమ్మన్ కోవిల్ వీధిలో భూగర్భ డ్రైనేజీ పథకం, అదే ప్రాంతంలోని ఏవీకే నగర్, శ్రీలక్ష్మీనగర్ ప్రాంతాల కోసం సమగ్రనీటి పథకం, ఆలందూరు కన్నన్ కాలనీలో మురుగునీటి తొలగింపు పథకాలను ఆయన ప్రారంభించారు.

చెన్నైలో 20 పార్కులు...

ఇదిలా ఉండగా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన 20 ఉద్యానవనాలను స్టాలిన్ ప్రారంభించారు. మాధవరం జోన్ రంగా అవెన్యూ, శ్రీనివాస నగర్ రెండో వీధి, జయమారుతి నగర్ (ఈస్ట్), శ్రీబాలాజీ నగర్ వీఎస్ మణి నగర్ (సౌత్), వీఎస్ మణినగర్ (నార్త్), రాయపురం జోన్ మింట్ ఫ్లైఓవర్ దిగువ, అన్నానగర్ జోన్ అన్నానగర్ ఇన్నర్‌రింగ్ రోడ్డు, వలసరవాక్కం మండలం నోలంబూరు రెండో మెయిన్‌రోడ్డు, టీఎన్‌హెచ్‌బీ ఓఎస్ఆర్ టీఎన్‌హెచ్‌బీ ఓఎస్ఆర్2, కామరాజర్ నగర్ ఐదో బ్లాక్, వీజీఎన్ నగర్, బృందావన్ నగర్ ఐదో వీధి, అరుళ్‌మిగు మీనాక్షి అమ్మన్‌నగర్, తమిళ్‌నగర్, చోళింగనల్లూరు జోన్ ఎంజీఆర్ రోడ్డు ఆర్ఎంజెడ్ ఫేస్-1 ప్రాంతాల్లో రూ.9.50 కోట్లతో నిర్మించిన ఉద్యానవనాలను ఆయన ప్రారంభించారు.

2 భూగర్భ డ్రైనేజీలు...

గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలో రెండు భూగర్భ డ్రైనేజీ పథకాలకు స్టాలిన్ శంకుస్థాపన చేశారు. ఆ మేరకు ఈంజంబాక్కం ప్రాంతంలో సుమారు 33,700 మంది ప్రజలు లబ్ధిపొందేలా రూ.196.97 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పథకాన్ని, ఉత్తండి ప్రాంతంలో సుమారు 9400 మది లబ్ధిపొందలే రూ.82 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పథకాల్ని అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, ఈవీ వేలు, ఆర్ గాంధీ, టీఆర్‌బీ రాజా, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, చెన్నై కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ రాధాకృష్ణన్, నగరపాలక నిర్వహణ నీటిసరఫరా శాఖల ముఖ్య కార్యదర్శి డి.కార్తికేయన్, రాష్ట్ర నగర ఆర్థికాభివృద్ధి మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హనీష్ ఛబ్రా, రాష్ట్ర నీటి సరఫరా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.దక్షిణామూర్తి, చెన్నై మహానగర మంచినీటి సరఫరా, మురుగునీటి తొలగింపు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ టీజీ వినయ్ తదితరులు పాల్గొన్నారు.





చెన్నై సచివాలయంలో కొత్త తాగునీటి పథకాలు, డ్రైనేజీ పథకాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న సీఎం

కోవై సిగలో

తిరువళ్లువర్ విగ్రహం

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యనగరం కోయంబత్తూరులో స్మార్ట్ సిటీ పథకం అమలులో భాగంగా అక్కడి కురిచ్చి చిన్నకుళంలో ప్రతిష్ఠించిన తిరువళ్లువర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం ఉదయం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. తమిళ అచ్చులు, హల్లులు అంటూ మొత్తం 247 అక్షరాలు చెక్కబడిన ఈ విగ్రహం కోవైలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 25 అడుగుల ఎత్తు, 15 అడుగుల వెడల్పుతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.



కోయంబత్తూరులో ఏర్పాటు చేసిన తిరువళ్లువర్ విగ్రహం

'ఇండియా' కూటమిలోకి మరికొన్ని ప్రాంతీయపార్టీలు

● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



సీపీఐ రాష్ట్రస్థాయి నిర్వాహకుల సమావేశంలో ప్రసంగిస్తున్న కె.నారాయణ

ప్యారీస్, జనవరి 5: తమిళనాడు, పుదుచ్చేరిలోని 40 పార్లమెంటు స్థానాలు కైవసం చేసుకోవాలనే పట్టుదల డీఎంకే కూటమిలో బలపడిందని, త్వరలోనే మరికొన్ని ప్రాంతీయ పార్టీలు తమ కూటమితో జత కట్టనున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పేర్కొన్నారు. స్థానిక టి.నగర్‌లోని సీపీఐ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి పార్టీ నిర్వాహకుల సమావేశంలో రాష్ట్ర ఇన్‌చార్జిగా పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు. ఈ సమావేశంలో డీఎంకే అధిష్టానం వద్ద తమకు అనుకూలంగా ఉన్న నియోజకవర్గాలను కేటాయించమని కోరడం, ఎన్నికల ప్రచార వ్యూహం, పార్టీ తరపున ఎంపిక చేయాల్సిన అభ్యర్థులు, బూత్ కమిటీల నియామకం తదితర అంశాలపై చర్చించారు. ముందుగా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ... కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని గద్దె దించడమే ఇండియా కూటమి ఏకైక లక్ష్యమని, ఇది నెరవేరే దిశగా వామపక్షాలు విస్తృత ప్రచారంలో పాల్గొంటాయన్నారు. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో మొత్తం ఉన్న 40 ఎంపీ సీట్లలో ఘనవిజయం సాధించాలన్నదే తమ కూటమి లక్ష్యమని, త్వరలోనే సీట్ల సర్దుబాటుపై నిర్వహించనున్న చర్చలకు తమను ఆహ్వానిస్తారని తెలిపారు. రాష్ట్రంలో డీఎంకే నేతృత్వంలోని కూటమితో జతకట్టేందుకు మరికొన్ని ప్రాంతీయ పార్టీలు సిద్ధంగా ఉన్నాయని, దేశంలో మతవిద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీని ఓటు అనే ఆయుధంతో ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మతాన్ని ముందుంచి ఓట్లు రాబట్టుకొనే కుతంత్రాలు చేపట్టిన బీజేపీకి తప్పకుండా ప్రజలు గుణపాఠం చెబుతారని నారాయణ అన్నారు. ఈ సమావేశంలో ముత్తరసన్ రాజకీయ కార్యకలాపాల నివేదిక సమర్పించారు. సహాయ కార్యదర్శి ఎం.వీరపాండ్యన్ సహా అన్ని జిల్లాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జనవరి 5: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా తండయార్‌పేట పరిధిలోని గుమ్మాళమ్మన్ ఆలయ వీధి, జీఏ రోడ్డు, టీహెచ్ రోడ్డు, సోలయప్పన్ వీధి, కప్పల్‌పోలు వీధి, వీపీ ఆలయ వీధి, తాండవరాయన్ వీధి, శ్రీరంగమ్మాళ్ వీధి, రామానుజం వీధి, బాలమొదలి వీధి, పాతచాకలిపేట, ఇళయవీధి, మన్నప్పన్ వీధి, తంగవేల్ వీధి, వీరాకుట్టి వీధి, కేజీ గార్డెన్, బాసుదేవ్ వీధి ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ బోర్డు తెలిపింది.

నేటినుంచి ఇంజనీరింగ్ పోస్టులకు పరీక్షలు

ఐసిఎఫ్, జనవరి 5: ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ పోస్టుల భర్తీకి నిర్వహించనున్న రాత పరీక్షలు ఈనెల 6న శనివారం ప్రారంభం కానున్నాయి. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ గత ఏడాది అక్టోబరు 13వ తేది విడుదల కాగా, 59,630 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 202 కేంద్రాల్లో శని, ఆదివారాల్లో పరీక్షలు జరుగుతాయని టీఎన్‌పీఎస్సీ తెలిపింది. అలాగే, గ్రూప్-7ఏ పోస్టుల భర్తీకి కూడా చెన్నైలో ఏర్పాటైన పరీక్షా కేంద్రంలో శని, ఆదివారాలు పరీక్షలు జరుగుతాయి.

నేడు పనిచేయనున్న ప్రభుత్వ పాఠశాలలు

పెరంబూర్, జనవరి 5: చెన్నై జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు నేటినుంచి నాలుగు వారాలు శనివారాల్లో పని చేయనున్నాయి. మిచౌంగ్ తుపాను కారణంగా ప్రభుత్వ పాఠశాలలకు వరుసగా నాలుగు రోజులు సెలవులు ప్రకటించారు. ఈ సెలవులు భర్తీ చేసేలా ఈ నెల 6, 20, ఫిబ్రవరి 3, 17(శనివారాలు) తేదీల్లో ప్రభుత్వ పాఠశాలలు పని చేస్తాయని జిల్లా ప్రధాన విద్యాధికారి తెలిపారు.

14 ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు

ఐసిఎఫ్, జనవరి 5: రాష్ట్రం నుంచి ఉత్తరాదికి వెళ్లే 14 ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు చేసినట్లు సేలం రైల్వే డివిజన్ తెలిపింది. ఉత్తరప్రదేశ్‌లో జరిగే రైలు మార్గ మరమ్మతుల కారణంగా రైలు సర్వీసులు రద్దయ్యాయి. తిరువనంతపురం నుంచి ఢిల్లీకి వెళ్లే కేరళ ఎక్స్‌ప్రెస్, తిరువనంతపురం - హజరత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 9 నుంచి ఫిబ్రవరి 2వ తేది వరకు, ఎర్నాకుళం- హజరత్‌నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ శనివారం నుంచి ఫిబ్రవరి 6వ తేది వరకు, కోవై- హజరత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 21, 24, 28, 31 తేదీలు, మదురై, చండీఘర్ రైలు ఈనెల 10నుంచి ఫిబ్రవరి 5వ తేది వరకు, కన్నియాకుమారి - శ్రీమాతా వైష్ణో దేవి కత్రా వారాంతపు రైలు ఈనెల 12నుంచి ఫిబ్రవరి 5వ తేది వరకు, తిరునల్వేలి - శ్రీమాతా వైష్ణో దేవి కత్రా వారాంతపు రైలు ఈ నెల 8 నుంచి ఫిబ్రవరి 1వ తేది వరకు రెండు మార్గాల్లో రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయాల్లో 64 లక్షల మంది నమోదు

ఐసిఎఫ్, జనవరి 5: ఉద్యోగావకాశాల కార్యాలయాల్లో గత ఏడాది డిసెంబరు 31వ తేది వరకు 64 లక్షలా 13 వేలా 675 మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. వారిలో పురుషులు 29,73,923 మంది, మహిళలు 34,39,455 మంది, హిజ్రాలు 297 మంది ఉన్నారు. అందులో 18 ఏళ్లలోపు పాఠశాల విద్యార్థులు 14,94,409 మంది, 31 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపున్న వారు 17,86,200 మంది, 60 ఏళ్ల పైబడిన వారు 6,872 మంది, దివ్యాంగులు 1,48,856 మంది ఉన్నారని అధికారులు తెలిపారు.

కోయంబేడులో సంక్రాంతికి ప్రత్యేక సంత

ఐసిఎఫ్, జనవరి 5: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రత్యేక సంత ఏర్పాటు చేయనున్నట్లు కోయంబేడు మార్కెట్ నిర్వాహకులు తెలిపారు. యేటా దీపావళి, విజయదశమి, సంక్రాంతి వంటి పండుగలకు ప్రత్యేక సంతలు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. ఆ ప్రకారం, మార్కెట్ వెనుక వైపు ఉన్న రోడ్డులో ఉన్న వాహన పార్కింగ్‌లో సుమారు 3 ఎకరాల్లో సంత ఏర్పాటు చేస్తున్నట్లు మార్కెట్ నిర్వాహకులు తెలిపారు.

9,10 తరగతుల బీసీ విద్యార్థినులకు విద్యా ఉపకారవేతనం

ప్యారీస్, జనవరి 5: ప్రభుత్వ పాఠశాలల్లో 9,10 తరగతులు చదువుకుంటున్న బీసీ విద్యార్థినులకు సంవత్సరానికి రూ.4,000 విద్యా ఉపకారవేతనం పంపిణీ చేయనున్నట్లు చెన్నై జిల్లా కలెక్టర్ తెలిపారు. కేంద్రప్రభుత్వ నిధుల సహకారంతో ఈ ఉపకారవేతనాన్ని విద్యార్థినులకు అందజేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిందని, ఈ పథకం కింద లబ్ధిపొందగోరే వారి వార్షికాదాయం రూ.2.5 లక్షలకు మించకుండా ఉండాలని, అర్హులైన 9,10 తరగతి విద్యార్థినులకు వారి పేరుతో జాతీయ బ్యాంకుల్లో ఈ ఉపకార వేతనం జమ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం విద్యార్థినులు తమ పేరుతో బ్యాంక్ ఖాతా ప్రారంభించాలని, అలాగే, తల్లిదండ్రుల వార్షికాదాయం సర్టిఫికెట్ నకలును సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్ద సమర్పించాలని కలెక్టర్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

20 వేల ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్‌క్లాస్‌లు

ఐసిఎఫ్, జనవరి 5: రాష్ట్రంలో 20 వేల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్‌లు ప్రారంభించేందుకు, ఉపాధ్యాయులకు రూ.81 కోట్లతో ట్యాబ్‌లు అందజేసేందుకు పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 33 వేల ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు పని చేస్తున్నాయి. వీటిలో ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆధునిక విధానంలో విద్యనభ్యసించేలా స్మార్ట్ తరగతులు ఏర్పాటు చేసేందుకు, ఇంటర్నెట్ వసతి కల్పించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇది వరకే ఉన్నత, మహోన్నత పాఠశాలల్లో ఈ సౌకర్యాలు ఏర్పాటు చేయగా, ప్రస్తుతం 20 వేల ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ తరగతులు ప్రారంభించి, మొత్తం 53,349 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

వేలూరు, జనవరి 5: కనియంబాడి సమీపం కమ్మవాన్‌పేటలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్కాడు ఎమ్మెల్యే ఈశ్వరప్పన్ పాల్గొని, విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ కమిటీ సభ్యులు జయలక్ష్మి ఏలుమలై, స్థానిక పంచాయతీ అధ్యక్షుడు కవిత మురుగన్ తదితరులు పాల్గొన్నారు.



వేలూరు కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వరద నివారణ నిధికి రూ.లక్ష చెక్‌ను కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్‌కు అందిస్తున్న మాజీ ప్రభుత్వ ఉద్యోగి నటరాజన్, వసంత దంపతులు

‘ప్రజలతో ముఖ్యమంత్రి’ ప్రత్యేక శిబిరాల ప్రారంభం

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలితాలు వీలైనంత త్వరగా లబ్ధిదారులకు చేరాలని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆశిస్తూ ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించిన ‘ప్రజలతో ముఖ్యమంత్రి’ ప్రత్యేక శిబిరాలు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని 15 జోన్లలో శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ పదిహేను జోన్లలో తలా ఒక వార్డు చొప్పున ఎంపిక చేసుకుని కార్పొరేషన్ ఉన్నతాధికారులు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ శిబిరాలను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్ ప్రియ అధికారులతో కలిసి పరిశీలన జరిపారు. రెండు రోజుల పాటు ఈ శిబిరాలు కొనసాగనున్నాయి. శనివారం తిరువొత్తియూరు జోన్ కత్తివాక్కం కార్పొరేషన్ స్కూలు, మాధవరం జోన్ నడయన్‌కుప్ప ఆంటోనియర్ చర్చి సామాజిక కేంద్రం, తండయార్‌పేట జోన్ ఆర్వీనగర్ ఫస్ట్ మెయిన్ రోడ్డులోని గురుమూర్తి పాఠశాల, రాయపురంజోన్ కళింగరాయన్ వీధిలోని అన్నా కల్యాణమండపం, తిరువికనగర్ జోన్ తిరువీధియమ్మన్ కోవిల్ వీధిలోని కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఇదే విధంగా అంబత్తూరు ఎస్ఎంకే మండపం, విల్లివాక్కం కనకదుర్గా పాఠశాల, ట్రిప్లికేన్ బిసెంట్‌రోడ్డు ఉర్దూ బాలరు ప్రాథమిక పాఠశాల, విరుగంబాక్కం కామరాజర్ వీధి 128వ వార్డు కార్యాలయం, టి.నగర్ జీఎన్‌చెట్టి రోడ్డులోని సర్ పిట్టి త్యాగరాయర్ అరంగం, మధురవాయల్ ఆలపాక్కం మెయిన్‌రోడ్డులోని ఆర్‌ఆర్ మహాల్, ఆలందూరు అప్పావు వీధిలోని కర్పగవినాయకర్ ఆలయ మండపం, చోళింగనల్లూరు జోన్ దురైపాక్కం రేడియల్ రోడ్డులోని కింగ్స్ లెండింగ్ పార్టీ హాల్‌లో ఈ శిబిరాలు నిర్వహించనున్నారు.



తండయార్‌పేట జోన్ 38వ వార్డు పటేల్ నగర్‌లో నిర్వహిస్తున్న శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ ప్రియ

నెలరోజుల్లో పరిష్కారం...

తండయార్‌పేట జోన్ 38వ వార్డు పరిధిలోని పటేల్ నగర్‌లోని కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటైన ప్రత్యేక శిబిరాన్ని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ అధికారులతో కలిసి పరిశీలించి వినతిపత్రాలు సమర్పించేందుకు వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ... చెన్నైలో ‘ప్రజలతో ముఖ్యమంత్రి’ శిబిరాల్లో స్వీకరించే వినతి పత్రాలపై నెల రోజుల్లోగా చర్యలు తీసుకుని తెలియజేస్తామన్నారు. 15 జోన్లలో నిర్వహించిన ఈ శిబిరాలలో 3700కు పైగా వినతి పత్రాలను స్వీకరించినట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాలలో స్వీకరించే వినతి పత్రాలను ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారుల పరిశీలనకు పంపుతామన్నారు. వినతి పత్రాలపై తీసుకున్న చర్యలు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తామన్నారు.

గ్రంథాలయాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి

వేలూరు, జనవరి 5: స్థానిక కార్పొరేషన్ పరిధిలోని 4వ మండలం అరియూర్‌లో నిర్మించిన గ్రంథాలయాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. 11,840.70 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.2.50 కోట్లతో రెండతస్తుల్లో ఈ గ్రంథాలయం ఏర్పాటైంది. మొదటి అంతస్తులో కంప్యూటర్ కేంద్రం, స్మార్ట్ తరగతి, 75 అంగుళాల ఎల్ఈడీ టీవీ, జనరేటర్ తదితర వసతులు కల్పించారు. గ్రంథాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్ పాల్గొని, జ్యోతిప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో ఆనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్, వేలూరు ఎమ్మెల్యే కార్తికేయన్, కార్పొరేషన్ మేయర్ సుజాత ఆనందకుమార్, పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, మండల కమిటీ అధ్యక్షులు వెంకటేశన్, పుష్పలత వన్నియరాజా, నరేంద్రన్, కార్పొరేషన్ కమిషనర్ జానకి రవీంద్రన్, ఉప కమిషనర్ శశికళ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్

12 వరకు వ్యాపారులకు రుణాలు

ఐసిఎఫ్, జనవరి 5: సహకార బ్యాంకుల్లో ఈనెల 12వ తేది వరకు వ్యాపారులకు ప్రత్యేక రుణాలు అందజేసే శిబిరాలు జరగనున్నాయి. తుపాను బాధిత ప్రాంతాలకు చెందిన చిన్న వ్యాపారులకు రుణ పంపిణీ పథకాన్ని ప్రభుత్వం అమలుపరచింది. పూలు, పండ్లు, కూరగాయలు వంటి విక్రయించే చిన్న వ్యాపారులకు గరిష్ఠంగా రూ.10వేలు వరకు అందజేయనున్నారు. చెన్నై, తిరువళ్లూర్, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లో 19 ప్రాంతాల్లో వ్యాపారుల కోసం రుణాలు అందజేసేందుకు ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరాలు ఈనెల12వతేది వరకు కొనసాగనున్నాయని,వ్యాపారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు.

గణతంత్ర వేడుకలకు గిరిజన దంపతులు

ఐసిఎఫ్, జనవరి 5: గణతంత్ర దినోత్సవంలో పాల్గొనేందుకు గిరిజన దంపతులకు ఆహ్వానం అందింది. కోయంబత్తూర్ జిల్లా వాల్పారై సమీపంలోని కల్లార్గుడికి చెందిన జయగోపాల్, రాజ్యలక్ష్మి దంపతులు గిరిజన హక్కుల కోసం కృషి చేశారు. వీరి సేవలను అభినందించేందుకు కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఆధ్వర్యంలో జరిగే గణతంత్ర వేడుకల్లో వీవీఐపీలుగా వీరు పాల్గొననున్నారు. రాష్ట్రప్రభుత్వ సిఫారసు మేరకు కేంద్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఈ దంపతులకు ఆహ్వానం పంపింది.

పోలీసు అధికారికి వీడ్కోలు

వేలూరు, జనవరి 5: వేలూరు డీఐజీ ముత్తుస్వామి పోలీసు శాఖ అధ్యక్షుడిగా పదోన్నతి పొందారు. డీఐజీ ముత్తుస్వామిని శుక్రవారం కలసిన జిల్లా మాజీ ఖైదీల ఆదరణ సంఘం, కాట్పాడి డివిజన్ రెడ్‌క్రాస్ సంఘం తరఫున సెక్రటరీ జనార్దనన్, కోశాధికారి శ్రీనివాసన్‌లు కలుసుకొని శాలువాతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు.



డీఐజీని సత్కరిస్తున్న జనార్దనన్, శ్రీనివాసన్ తదితరులు

తూత్తుకుడిలో ఎలక్ట్రిక్ కార్ల కర్మాగారం

ఐసిఎఫ్, జనవరి 5: తూత్తుకుడి జిల్లాలో వియత్నాం దేశానికి చెందిన ‘విన్‌ఫాస్ట్’ సంస్థ ఎలక్ట్రిక్ కార్లు, విద్యుత్ వాహనాల బ్యాటరీల తయారీ కర్మాగారం నెలకొల్పనుంది. మొదట చెంగల్పట్టు జిల్లా మరైమలైనగర్‌లో పనిచేస్తున్న ‘ఫోర్డ్’ సంస్థ కార్ల తయారీ కర్మాగారంలో ఎలక్ట్రిక్ కార్ల తయారీకి విన్‌ఫాస్ట్ సంస్థ నిర్ణయించింది. అయితే అక్కడ స్థలాభావంతో తూత్తుకుడి జిల్లాలో 400 ఎకరాల్లో తొలివిడతగా రూ.2,000 కోట్లతో 50 వేల ఎలక్ట్రిక్ కార్లు తయారు చేసే సామర్థ్యం కలిగిన కర్మాగారాన్ని విన్‌ఫాస్ట్ సంస్థ నెలకొల్పనుంది. దీనికి సంబంధించిన అవగాహన ఒప్పందం ఈ నెల 7, 8 తేదీల్లో జరిగే ప్రపంచ పెట్టుబడిదారుల మహానాడులో జరగనుందని అధికారులు తెలిపారు.

రేపు అంతర్జాతీయ మానవ హక్కుల మహానాడు

వేలూరు, జనవరి 5: అంతర్జాతీయ మానవ హక్కుల సమాఖ్య 15వ దేశీయ మహానాడు ఆదివారం వేలూరులో జరగనుంది. ఈ మేరకు శుక్రవారం సమాఖ్య అధ్యక్షుడు డా.సురేష్‌ఖన్నా విలేకరులతో మాట్లాడుతూ... తమిళనాడు, పుదుచ్చేరి నిర్వాహకులు, సభ్యులు ఈ మహానాడులో పాల్గొంటారని, రాష్ట్రం, దేశం, అంతర్జాతీయంగా మానవ హక్కుల పరిరక్షణ, ఉల్లంఘనలపై సమావేశంలో చర్చిస్తామన్నారు. సమావేశంలో కమిటీ అధ్యక్షుడు శరవణన్, కోశాధికారి చిత్ర, ఉపాధ్యక్షుడు విజయకుమార్, బాలాజి, జాయింట్ సెక్రటరీ శాంత, ఉప సెక్రటరీ రంజిత్‌కుమార్, జాయింట్ సెక్రటరీలు పార్తిబన్, సత్యరాజ్, ఉపాధ్యక్షుడు సెంథిల్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న సురేష్ ఖన్నా

అలరించిన ‘సుషుప్తి’ నృత్య ప్రదర్శన



అడయార్, జనవరి 5: బ్రహ్మ గాన సభ సమర్పణలో నమార్గం డ్యాన్స్ కంపెనీ ఆధ్వర్యంలో జరిగిన ‘సుషుప్తి - యూనివర్స్ ఎవోల్వ్స్ బ్లిస్’ అనే థీంతో నిర్వహించిన శాస్త్రీయ నృత్యం ప్రేక్షకులను అలరించింది. చెన్నై సౌందరేశ్వరర వీధిలో ఉన్న ఆర్‌ఆర్ ఆడిటోరియంలో ఈనెల 4న ఈ నృత్య ప్రదర్శన జరిగింది. ప్రముఖ నృత్యకారిణి కార్తిక సుబ్రమణియం నేతృత్వంలో నందిని భరత్, రాకేష్ సాయిబాబు, వసంత్ కుమార్ మాధవ్, పూజా, రమ్య, బెన్, మాళవిక, చిప్పి, హరిణి, చాంద్, జహిద్, సహిల్ శిష్య బృందం ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా కార్తిక సుబ్రమణియం స్పందిస్తూ... ‘సుషుప్తి’ మహావిష్ణువు పరిణామాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించారన్నారు.

తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1.40 కోట్లు

ప్యారీస్, జనవరి 5: తిరువళ్లూర్ జిల్లాల్లో ప్రసిద్ధిచెందిన తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయంలో గత 35 రోజుల్లో స్వామివారిని దర్శించుకున్న భక్తులు హుండీలో రూ.1.40 కోట్ల కానుకలు చెల్లించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. వైకుంఠ ఏకాదశి, నూతన సంవత్సరం సందర్భంగా తిరుత్తణి ఆలయానికి భక్తులు పోటెత్తారు. హుండీలో భక్తులు కానుకగా సమర్పించిన వెండి, బంగారం, నగదు లెక్కింపు ఆలయ జాయింట్ కమిషనర్ రమణి పర్యవేక్షణలో గురువారం 13 గంటలు సాగింది. భక్తులు నగదుగా రూ.1,40,11,093, 429 గ్రాముల బంగారం, 8,565 గ్రాముల వెండి స్వామివారికి కానుకలుగా సమర్పించినట్లు అధికారులు తెలిపారు.

ఓల్డ్ టౌన్‌లో ‘ప్రజలతో ముఖ్యమంత్రి’

వేలూరు, జనవరి 5: స్థానిక ఓల్డ్‌టౌన్‌లోని కమ్యూనిటీ హాలులో శుక్రవారం ‘ప్రజలతో ముఖ్యమంత్రి’ కార్యక్రమం జరిగింది. 37వ వార్డు కౌన్సిలర్ గంగ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో డివిజన్ సెక్రటరీ లోకనాధన్, ప్రాంత అవై అధ్యక్షుడు పొన్.సుందర్, లక్ష్మణన్, అన్బు, ప్రకాష్, ప్రాంత ప్రతినిధి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కౌన్సిలర్

అయోధ్య వెళ్లనున్న రజనీకాంత్

అడయార్, జనవరి 5: అయోధ్య శ్రీరామ్ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ఆహ్వానం మేరకు రామాలయ కుంభాభిషేక ఘట్టానికి సూపర్‌స్టార్ రజనీకాంత్ హాజరు కానున్నారు. ఈ వేడుకలో పాల్గొనాల్సిందిగా ట్రస్ట్ నిర్వాహకులు స్వయంగా రజనీకాంత్‌కు ఆహ్వాన పత్రికను అందజేసిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో ఈనెల 22న జరిగే అయోధ్య రామాలయ కుంభాభిషేక ఘట్టంలో రజనీ పాలుపంచుకోనున్నారు. ఇందుకోసం ఆయన ఈనెల 21న అయోధ్యకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఆయనతో పాటు సతీమణి లతా, సోదరుడు సత్యనారాయణ కూడా వెళ్లనున్నారు. ఈ వేడుక ముగిసిన తర్వాత 23న ఆయన చెన్నైకి రానున్నారు. కాగా, ఈ కుంభాభిషేక ఘట్టానికి దేశవ్యాప్తంగా 8 వేల మందిని ఆహ్వానించిన విషయం తెల్సిందే. వీరిలో 3500 మంది సన్యాసులున్నారు. ఈ 8 వేల మందికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం బసతో పాటు ఇతర సౌకర్యాలను కల్పించనుంది.

ఆచార్య విస్తాలికి ‘పోట్లూరు సాహిత్య వేదిక’ పురస్కారం



ఆచార్య విస్తాలి శంకరరావు

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధిపతి, ఆచార్య విస్తాలి శంకరరావు నెల్లూరు జిల్లాకు చెందిన ‘పోట్లూరు సాహిత్య వేదిక’ జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు నిర్వాహకులు ప్రకటన విడుదల చేశారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు నెల్లూరు జిల్లా మైపాడు సముద్రతీరంలో ఈ పురస్కార ప్రదానోత్సవం జరగనుంది. కార్యక్రమంలో ముందుగా ప్రముఖ రచయిత పోట్లూరు సుబ్రహ్మణ్యం విరచిత ‘సముద్ర తీర కథలు’ పుస్తకావిష్కరణ జరుగనుంది.

రాజపాళయంలో కుండపోత

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా రాజపాళయంలో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం వేకువజాము వరకు కుండపోతగా కురిసిన వర్షాలకు జనజీవనం స్తంభించింది. ఆ నగరంలోని రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాజపాళయం సమీపంలోని సత్తిరపట్టి, వాగైకుళంపట్టి ప్రాంతాల్లోనూ ఉరుములు, మెరుపులతో భారీగా వర్షాలు కురిశాయి. గత డిసెంబర్ రెండోవారంలో కురిసిన కుండపోత వర్షాలకు నిండిన వాగైకుళం వాగు గురువారం రాత్రి కురిసిన వర్షానికి కట్టలు తెంచుకుని ఆ వాగు జలాలంతా జననివాస ప్రాంతాల్లో చొరబడ్డాయి. దీనితో సుమారు 20 నివాసగృహాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రధాన వీధులలో వరదలా వర్షపునీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తహసీల్దార్ రామచంద్రన్ ఇతర అధికారులు వర్షబాధిత ప్రాంతాలను పరిశీలించారు. పల్లపు ప్రాంతాల్లో నివసిస్తున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



రాజపాళయంలో గురువారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి జలమయమైన రహదారి

13న ‘మట్టిబండి - రచనా వైశిష్ట్యం’ పైచర్చా గోష్ఠి

అడయార్, జనవరి 5: స్థానిక మైలాపూరులోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి (రిజిస్టర్డ్) ప్రతి నెలా నిర్వహిస్తున్న సంగీత, సాహిత్య సాంస్కృతిక, సాంఘిక కార్యక్రమం “నెల నెలా వెన్నెల”లో భాగంగా ఈనెల 13వ తేదీన ‘మట్టిబండి - రచనా వైశిష్ట్యం’ అనే అంశంపై ఉపన్యాస ధారావాహిక కార్యక్రమం జరగనుంది. ఇందులో వక్తగా విశ్రాంత ఉపాధ్యాయిని కమలాకర రాజేశ్వరి పాల్గొని ప్రసంగిస్తారు. ప్రముఖ గాయని ఎస్.వసుంధరా దేవి పరిచయ కార్యక్రమంతో ఈ 44వ ‘నెట్’ ఇంట్లో సమావేశం 13వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుందని స్మారక సమితి నిర్వాహకులు శుక్రవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

రెవియా బ్రాండ్ గేర్ ఇంజిన్ ఆయిల్



అడయార్, జనవరి 5: బ్రేక్స్ ఇండియా కొత్తగా రెవియా బ్రాండ్ పేరుతో గేర్, ట్రాన్స్‌మిషన్ ఆయిల్‌ను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఈ కంపెనీ ఉత్పత్తి చేసే లుబ్రికెంట్స్ ఆయిల్స్ మార్కెటింగ్ విస్తరణ చర్యల్లో భాగంగా ఈ కొత్త బ్రాండ్‌ను పరిచయం చేసింది. ఇదే విషయంపై బ్రేక్స్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుజిత్ నాయర్ మాట్లాడుతూ... క్వాలిటీ అండ్ సెఫ్టీపై తాము ప్రత్యేక దృష్టిని సారించామన్నారు. ఇది ప్యాసింజర్స్ కార్లు, కమర్షియల్ వాహనాల వినియోగదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కాగా, తొలిదశలో 80డబ్ల్యూ90, 85డబ్ల్యూ140 గ్రేడ్లలో ఆయిల్‌ను ప్రవేశపెట్టామని ఆయన గుర్తు చేశారు.

9కి వాయిదా పడిన కొడనాడు కేసు విచారణ

అడయార్, జనవరి 5: కొడనాడు ఎస్టేట్‌లో జరిగిన సెక్యూరిటీ గార్డు హత్య, దోపిడీ కేసు విచారణ ఊటీ కోర్టులో సాగుతుండగా ఈ కేసు విచారణ శుక్రవారం జరిగింది. నిందితుల్లో సయాన్ సహా మొత్తం ముగ్గురు కోర్టుకు హాజరయ్యారు. ఇరు వర్గాల న్యాయవాదులు కూడా హాజరయ్యారు. వారి వాదనలు ఆలకించిన న్యాయమూర్తి అబ్దుల్ ఖాదర్ ఈ కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 9వ తేదీకి వాయిదా వేశారు.

మరణంలోనూ వీడని వృద్ధ దంపతులు

ప్యారీస్, జనవరి 5: స్థానిక ఆవడి ప్రాంతంలో భార్య ఆసుపత్రిలో చేరిన వార్త విని దిగ్భ్రాంతికి గురైన 95 ఏళ్ల భర్త గుండెపోటుతో మరణించగా, చికిత్స ఫలించక భార్య కూడా తిరిగిరాని లోకాలకు చేరుకున్నారు. ఆవడి కామరాజ్ నగర్ 6వ వీధికి చెందిన సుబ్రమణియన్ (95) ఆ ప్రాంతం లో ఉన్న తమిళనాడు ప్రత్యేక పోలీసు విభాగంలో పనిచేసి పదవీవిరమణ పొందారు. ఆయన సతీమణి వసంత (81). వీరికి నాగరాజన్ (67), శరవణన్ (51) అనే కుమారులు, ఎళిలరసి (63) అనే కుమార్తె ఉన్నారు. ఈ నేపథ్యంలో, బుధవారం సాయంత్రం హఠాత్తుగా అస్వస్థతకు గురైన వసంతను తిరుముల్లైవాయల్‌లో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ సమాచారం తెలిసి దిగ్భ్రాంతి చెందిన సుబ్రమణియన్ గుండెపోటుతో మరణించగా, ఆయన భార్య వసంత చికిత్స ఫలించక గురువారం మృతి చెందింది.

50 సవర్ల నగలు, రూ.9 లక్షల దోపిడీ

వేలూరు, జనవరి 5: గుడియాత్తం అగ్రహారానికి చెందిన రంగనాథన్ స్థానిక బజార్ ప్రాంతంలో నగల తయారీ దుకాణం నడుపుతున్నాడు. ఆయన నగల ఆర్డర్లు తీసుకొని తయారు చేసి అందిస్తుంటాడు. ఈ క్రమంలో, పరదరామిలో ఉన్న నగల దుకాణం ఆర్డరు చేసి నగలు అందించేందుకు రంగనాథన్, స్నేహితుడు అన్బరసుతో కలసి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. మార్గమధ్యంలో ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులు వారి వాహనాన్ని అడ్డుకొని కళ్లలో కారం కొట్టి, సుమారు 50 సవర్ల నగలు, రూ.9 లక్షల నగదు దోచుకొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదుతో పరదరామి పోలీసులు కేసు నమోదుచేసి, పరారైన ఆగంతకుల కోసం గాలిస్తున్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో స్టాలిన్‌కే నా మద్దతు

● కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి



కేతిరెడ్డికి కేక్ తినిపిస్తున్న డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో సీఎం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కూటమికి మద్దతు ఇవ్వనున్నట్లు తమిళనాడు తెలుగు యువశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి ప్రకటించారు. త్వరలో చెన్నైలో నిర్వహించనున్న తెలంగాణ ముఖ్యమంత్రి విజయోత్సవ సభకు మంత్రి ఉదయనిధిని ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. శుక్రవారం కేతిరెడ్డి తన జన్మదినోత్సవాన్ని అపోలో ఆసుపత్రుల ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి గృహంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి ప్రతాప్ సి రెడ్డి ఆశీస్సులు పొందారు. అనంతరం కేతిరెడ్డి జన్మదినం సందర్భంగా పలు ఆయాల్లో పూజలు, అన్నదానం, వృద్ధులకు పండ్లు పంపిణీ వంటి కార్యక్రమాలు జరిగాయి. అమింజికరైలోని హోప్ పబ్లిక్ చారిటబుల్ ట్రస్టులోనూ కేతిరెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. తెలుగు యువశక్తి కార్యవర్గ సభ్యులు డి.శివశంకర్‌రెడ్డి, బి.వర్ధన్, ప్రభాకర్, జి.బాబు, ఏపీ బాలాజీ, సుధాకర్, సీఏ హరీష్, పి.ఉదయకుమార్, పి.ఆడం, వసంత్ ప్రభ, టామ్స్ అధినేత గొల్లపల్లి ఇశ్రాయేలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి మాట్లాడుతూ... తెలుగు భాష కోసం తను చేస్తున్న కృషి పట్ల సంతోషంగా ఉందన్నారు. భాషల అణచివేతను నేడు కొంతమంది రాజకీయ అవసరాల కోసం వాడుకుంటున్నారని, ప్రజలు దీనిని గ్రహిస్తున్నారన్నారు. ఇక్కడి వివిధ పార్టీల్లో తెలుగువారు మంత్రులుగా పని చేసినా, వారికి మాతృభాష పట్ల ప్రేమాభిమానాలు కరువయ్యాయన్నారు.

రవాణా కార్మికుల సమ్మెనోటీస్‌పై సీఎం సీరియస్

7న మళ్లీ త్రైపాక్షిక చర్చలు ● మంత్రి శివశంకర్ ప్రకటన



చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా కార్మికులు ఈనెల 9వ తేదీ నుంచి జరపదలచిన నిరవధిక సమ్మెను ఆపేందుకు చర్యలు తీసుకోవాలంటూ సీఎం స్టాలిన్ రవాణా శాఖ మంత్రి శివశంకర్‌కు ఆదేశాలిచ్చారు. ఈనెల 7న రవాణా కార్మికుల సంఘాల ప్రతినిధులతో చర్చలు జరపనున్నట్లు శుక్రవారం రాత్రి మంత్రి ప్రకటించారు. అంతకు మునుపు ఆయన రవాణా కార్మికుల సంఘాల ప్రతినిధులతో రెండు గంటలపాటు సమావేశ మయ్యారు. 15వ వేతనసంఘం సిఫారసుల మేరకు వేతనాలు పెంచాలని, ఎంఛన్‌దారులకు కరువుభత్యం బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశాయి. ఆ దిశగా రెండు సార్లు రవాణా శాఖ ఉన్నతాధికారులు, మంత్రి కార్మిక శాఖ కమిషనర్‌తో త్రైపాక్షిక చర్చలు జరిగాయి. గురువారం జరిగిన రెండో విడత చర్చలు కూడా విఫలమయ్యాయని కార్మిక సంఘం నేతలు ప్రకటించారు. దీంతో ఈనెల 9వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించారు. శుక్రవారం ఉదయం సచివాలయంలో సీఎం స్టాలిన్ రవాణా కార్మికుల సమ్మె నిర్ణయంపై ఆ శాఖ మంత్రి శివశంకర్, అధికారులతో అత్యవసరంగా చర్చలు జరిపారు. సంక్రాంతి పండుగ సెలవులు సమీపిస్తున్న సమయంలో రవాణా కార్మికులు సమ్మెకు దిగితే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని, సమ్మె యోచనను విరమింపజేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని స్టాలిన్ ఆదేశించారు. ఆ ప్రకారం కార్మిక సంఘాల ప్రతినిధులతో మంత్రి సమావేశం నిర్వహించారు. రెండు గంటలపాటు జరిగిన ఈ సమావేశంలోపింఛన్‌దారుల కరవుభత్యం బకాయిలు చెల్లించాలంటూపట్టుబట్టారు. సీఎంతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.

చిన్న నోలంబూరులో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు

● మంత్రి నెహ్రూ పరిశీలన




ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి కేఎన్ నెహ్రూ తదితరులు

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ వలసరవాక్కం జోన్‌లో పూందమల్లి హైరోడ్డు యూనియన్ రోడ్డును కలిపేవిధంగా మదురవాయల్ రేషన్ బస్టాపు సమీపంలోని చిన్న నోలంబూరు వద్ద రూ.42.71 కోట్లతో కూవం కాలువపై ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ, మేయర్ ఆర్ ప్రియ, శ్రీపెరుంబుదూరు లోక్‌సభ సభ్యుడు టీఆర్ బాలు, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ డాక్టర్ జే రాధాకృష్ణన్ ఇతర అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నెహ్రూ మాట్లాడుతూ... చిన్న నోలంబూరు, పూందమల్లి హైరోడ్డును కలిపే విధంగా కూవం నదిపై 245 మీటర్ల పొడవు, 20.70 మీటర్ల వెడల్పుతో టూవే ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నామని పేర్కొన్నారు.

సీ, డీ కేటగిరీ ఉద్యోగులకు పొంగల్ బోనస్

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న సీ, డీ కేటగిరి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు, ఫించన్‌దారులకు, కుటుంబ సంక్షేమ ఫించన్ పొందుతున్నవారికి సీఎం స్టాలిన్ పొంగల్ బోనస్ ప్రకటించారు. ఆ మేరకు సీ, డీ గ్రూపునకు చెందిన సిబ్బంది, ఉపాధ్యాయులకు గరిష్ఠంగా రూ.3వేలు, కాంట్రాక్టు వేతనం పొందుతున్న ఉద్యోగులకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో 240 రోజుల దాకా లేదా అంతకంటే ఎక్కువ రోజులు పని చేసిన వారికి రూ.1000, ఇదే విధంగా సీ, డీ గ్రూపు పింఛన్‌దారులకు కుటుంబ సంక్షేమ ఫించన్‌దారులకు, మాజీ గ్రామ సిబ్బందికి రూ.500 చొప్పున పొంగల్ బోనస్‌గా చెల్లించనున్నారు. ఈ నగదు చెల్లింపుల వల్ల ప్రభుత్వానికి రూ.167.68 కోట్ల మేరకు భారం పడుతుందని తెలిపారు.



చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకుని తుఫాను బాధితుల సహాయార్థం రూ.3 కోట్ల విరాళాన్ని అందజేస్తున్న కాగ్నిజెంట్ ఇండియా లిమిటెడ్ ఛైర్మన్ రాజేష్ నంబియార్

తరుణి





కర్ణాటక సంగీతంలోని గమకాలను యథాతథంగా పలికించగల వాయిద్యాల్లో అగ్రతాంబూలం నాదస్వరానిదే. పురాతనమైన ఆ వాయిద్యం ఎంతో మంగళప్రదమైనది కూడా. అందుకే శుభకార్యాల్లో ఆ వాద్య శ్రవణం అనాదిగా వస్తోంది. నాదస్వరాన్ని తెలుగులో సన్నాయి అని పిలుస్తారు. తమిళనాట నిష్ణాతులైన నాదస్వర విద్వాంసులకు కొదవలేదు. నాదస్వరగాన ప్రదర్శనల్లో తమిళ కళాకారులదే పైచేయి. అయితే పురుషాధిపత్యం కొనసాగుతున్న ఈ కళలో మహిళలు రాణించడం అరుదైన విషయం. అందులోనూ 13 యేళ్ల బాలిక రాణించడం విశేషం. నాదస్వరంలో నిష్ణాతురాలిగా కేంద్రప్రభుత్వం నుంచి పద్మశ్రీ అవార్డు సాధించాలనే తపనతో తండ్రితో కలిసి వందల సంఖ్యలో నాదస్వర కచేరీల్లో పాల్గొని తన ప్రతిభాపాటవాలను ఎలుగెత్తి చాటుతోంది.

- చెన్నై, ఆంధ్రజ్యోతి



తండ్రి సెంథిల్‌తో కలిసి నాదస్వరం వాయిస్తున్న కావ్యలక్ష్మి

పద్మశ్రీ అవార్డు సాధనే లక్ష్యం

పిన్నవయస్సులోనే నాదస్వర కళాకారిణిగా రాణిస్తున్న కావ్యలక్ష్మి

కావ్యలక్ష్మి

పిట్ట కొంచెం కూత ఘనం

తండ్రే గురువు... విరుదునగర్ సమీపం మల్లాంకినరులోని ప్రభుత్వ ఎయిడెడ్ ఎంఎ్‌సబీ ఉన్నపాఠశాలలో 8వ తరగతి చదువుతోంది కావ్యలక్ష్మి. మూడో తరగతి చదువుతుండగానే తండ్రి నాదస్వరం వాయిస్తుండటం చూసి, విని ఆ సన్నాయిని తాను కూడా వాయించాలనే ఆశ పుట్టినట్టు చెప్పింది. ఆ విషయాన్ని తెలపగానే ఆయన ఎంతో సంతోషించారు. తన వారసురాలిగా ఈ కళను భావితరాలకు తీసుకెళ్లగలననే నమ్మకంతో ఆయన నాదస్వరం నేర్పేందుకు ఉపక్రమించారు. తండ్రినే గురువుగా స్వీకరించి శిక్షణ పొందానని కావ్యలక్ష్మి చెబుతోంది. తన తమ్ముడు కరుప్పసామికూడా నాదస్వరం నేర్చుకుంటున్నాడని తెలిపింది.

స్వరాలపై శిక్షణ

తొలుత రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఊపిరి బిగపట్టి స్వరాలు పలికించడంపై శిక్షణ పొందానని ఆ తర్వాత సరళి, జంటవరుస, ఆరోహణం, అవరోహణం, అలంకారం, గీతం, వర్ణం, కీర్తన అంటూ ఒక్కొక్కటిగా శిక్షణ పొందానని కావ్యలక్ష్మి చెప్పింది. కఠోరమైన సాధన తర్వాత తండ్రితోపాటు కచేరీలకు వెళ్తే ఆయనతో పాటు నాదస్వరం వాయించి ప్రశలందుకున్నట్లు కావ్యలక్ష్మి నవ్వుతూ వివరించింది.

మీనాక్షి సన్నిధిలో... మదురై మీనాక్షి అమ్మవారి సన్నిధిలో నాదస్వరం వాయించడం మరచిపోలేని మధురమైన అనుభవమని కావ్యలక్ష్మి తెలిపింది. ఆ ఆలయ ఉత్సవాల్లో తండ్రితోపాటు నాదస్వర కచేరీ చేయడం తనకెంతో సంతోషాన్ని సంతృప్తిని కలిగించిందని చెప్పింది. మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో ఎంతోమంది హేమాహేమీలైన సంగీత కళాకారులు, విద్వాంసులు మాత్రమే నాదస్వరం వాయించేవారని, అలాంటిది ఆ విద్వాంసుల వరుసలో తనకు కూడా అవకాశం కల్పించడం మహాభాగ్యమని తెలిపింది. తను చదువుతున్న పాఠశాలలో ఉపాధ్యాయులు కూడా ప్రోత్సహిస్తున్నారని, వారి సిఫారసుతో ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ నాదస్వరం వాయించే అవకాశాలు వస్తున్నాయని వివరించింది. ఏది ఏమైనప్పటికీ నాదస్వర విద్వాంసురాలిగా కేంద్రప్రభుత్వం నుంచి పద్మశ్రీ అవార్డును పొందడమే తన జీవితాశయమని కావ్యలక్ష్మి పేర్కొంది. ఆమె ఆశయం నెరవేరాలని మనమందరం ఆశిద్దాం!

చదివింది ఎనిమిదో తరగతే...

'పిట్ట కొంచెం కూత ఘనం' అన్నట్లుగా కావ్యలక్ష్మి చదివింది ఎనిమిదో తరగతి అయినప్పటికీ నాదస్వర సాధనలో దిట్ట. ఊపిరి బిగబట్టుకుని సప్తస్వరాలను సన్నాయిలో వినిపించేందుకు మగవారు సైతం జంకే ప్రస్తుత పరిస్థితుల్లో 13 యేళ్ల వయస్సులో ఆమె ప్రదర్శనలు ఇస్తూ పలువురి ప్రశంసలందుకుంటోంది. కావ్యలక్ష్మి నాదస్వర గానం శ్రోతలను సంగీత ఆధ్యాత్మిక లోకానికి తీసుకెళుతోంది. తండ్రి నుంచి అలవరించుకున్న ఈ సంగీత కళను భావితరాలకు అందించాలనే తపనతో నాదస్వర కళాకారిణిగా ముందుకు దూసుకెళుతోంది కావ్యలక్ష్మి. ఆమె స్వస్థలం విరుదనగర్ సమీపం మల్లాంకినరు. తండ్రి సెంథిల్ నాదస్వర విద్వాంసులు. తల్లి అనిత ఆదర్శ గృహిణి. కావ్యలక్ష్మి తన ఎనిమిదో యేటనే తండ్రి వద్ద నాదస్వరం నేర్చుకొని ప్రస్తుతం కచేరీల్లో ఆయనతోనే పోటీపడే రీతిలో నాదస్వరం వాయిస్తూ గురువును మించిన తనయగా పేరుగడిస్తోంది. ఓ వైపు పాఠశాలలో చదువుతూనే మరో వైపు కచేరీలకు వెళుతూ బిజీగా ఉంటున్న కావ్యలక్ష్మి తన అనుభవాలను 'తరుణి'తో పంచుకుంది.

12నుంచి చేరన్స్
'జర్నీ' స్ట్రీమింగ్

తమిళ చిత్రపరిశ్రమలో రియలిస్టిక్ మూవీలతో తనదైనశైలిలో చెరగని ముద్ర వేసిన చేరన్ దర్శకత్వంలో రూపొందిన తొలి వెబ్ సిరీస్ చేరన్స్ 'జర్నీ' ఈ నెల 12వ తేదీ నుంచి సోని లివ్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందిన చేరన్.. 'ఆటోగ్రాఫ్' చిత్రంతో హీరోగా మారారు. ఆ తర్వాత దర్శకత్వం, హీరో ఇలా రెండు పడవల ప్రయాణం చేస్తూ వచ్చిన ఆయన.. చివరిసారిగా 2019లో 'తిరుమణం' అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. ఇపుడు దాదాపు ఐదేళ్ల విరామం తర్వాత ఆయన తొలిసారి తన పంథాకు భిన్నంగా వెబ్ సిరీస్‌ను తెరకెక్కించారు. ఈ వెబ్ సిరీస్‌ను 9 ఎపిసోడ్లలో ఒక్కో ఎపిసోడ్ 40 నిమిషాలతో రూపొందించారు. సీనియర్ నటుడు శరత్ కుమార్, ప్రసన్న, ఆరి అర్జునన్, కలైయరసన్, దివ్యభారతి, హిందీ నటుడు కశ్యప్ ప్రధాన పాత్రలను పోషించగా, జయప్రకాష్, జాస్మిన్, అనుపమ, ఇళవరసు, నరేన్, అంజు కురియన్, వేల రామ్మూర్తి ఇతర పాత్రల్లో కనిపించనున్నారు. ఎన్‌కే ఏకాంబరం ఛాయాగ్రహణం అందించిన ఈ వెబ్‌సిరీస్‌కు సి.సత్య సంగీతం అందించారు. ఈ వెబ్‌సిరీస్ ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా చేరన్, శరత్‌కుమార్, ప్రసన్న, జయప్రకాష్, కలైయరసన్, కశ్యప్, దివ్యభారతి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ముందుగా చేరన్ మాట్లాడుతూ... 'పారిశ్రామికవేత్త అయిన శరత్‌కుమార్ తన కంపెనీలోని ఒక కీలక ఉద్యోగానికి ఐదుగురిని ఇంటర్వ్యూ చేస్తారు. ఆ ఐదుగురి నేపథ్యం, ఆ ఉద్యోగం ప్రాధాన్యం, వారి జీవితాలను ఏ విధంగా మార్చింది? వారు ఏం నేర్చుకున్నారు? అన్నదే ఈ వెబ్ సిరీస్ స్టోరీ. ఇందులో వ్యవసాయం ప్రాధాన్యతను వివరించాం. అనలిస్టుగా జయప్రకాష్ నటించారు. ప్రసన్నకు సంబంధించిన సన్నివేశాలను అమెరికాతో పాటు మన దేశంలో చిత్రీకరించాం. 'బ్యాచిలర్' చిత్రం తర్వాత దివ్యభారతికి ఇండస్ట్రీలో గ్లామర్ నటిగా గుర్తింపు వచ్చింది. కానీ, ఇందులో ఆమె మహిళా రైతుగా కనిపిస్తారు. పురుషుల పేర్ల వెనుక కులం పేరు ఉంటుంది. అదే మహిళ పేరు వెనుక ఉండదు. వ్యవసాయంలోనూ మహిళల ప్రాధాన్యం అధికం. ఈ విషయాన్ని దివ్యభారతి పాత్రలో చూపించాం. ఈ ఐదుగురి పాత్రలు దేశంలోని నిరుద్యోగులతో పాటు యువత ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రతిబింబించేలా తెరకెక్కించాం. పాటలు కూడా ఉన్నాయి. నేను కేఎస్ రవికుమార్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసే సమయం నుంచే శరత్ కుమార్ బాగా తెలుసు. అందుకే ఈ పాత్రకు అడగ్గానే ఆయన సమ్మతించారు. రెండేళ్ల పాటు శ్రమించి ఈ వెబ్ సిరీస్‌ను తెరకెక్కించాం' అని తెలిపారు. శరత్‌కుమార్ మాట్లాడుతూ, 'చేరన్ గత చిత్రాలకు ఏమాత్రం తీసిపోకుండా ఈ వెబ్‌సిరీస్ ఉంటుందని చెప్పగలను' అన్నారు.



'జర్నీ' మూవీ లుక్

చిత్రజ్యోతి

మ్యూజికల్ రొమాంటిక్ మూవీగా 'తక తకిట'

ఆండాళ్ విజ్యువల్ మేకర్స్ బ్యానరుపై మ్యూజికల్ రొమాంటిక్ మూవీగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'తక తకిట'. కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, పాటలు, సంగీతం సమకూర్చిన రాజ్‌బాలా.. దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభ పూజా కార్యక్రమం తాజాగా చెన్నైలో జరిగింది. అదే రోజున రెండు పాటల రికార్డింగ్‌ను కూడా చేపట్టారు. హీరోలుగా నరేష ఈశ్వర్, జయబాలా, కొత్తముఖం సిద్ధార్థ్ నటిస్తుండగా, ఇతర పాత్రల్లో పలువురు ప్రముఖ నటీనటులు నటించనున్నారు. దర్శకుడికి ఇది తొలి చిత్రం కావడంతో వైవిధ్యభరితమైన కథను ఎంచుకుని, నేటి యువతరానికి కావాల్సిన అన్ని అంశాలతో వారిని ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు. ఈ సినిమాకు ఎడిటింగ్ ఆనంద్, కొరియోగ్రఫీ సుభాష్‌లింగా, కెమెరా మహిబాలన్, సంగీతం రాజ్‌బాలా. హీరోయిన్లను ఎంపిక చేయాల్సిన ఈ చిత్రం షూటింగ్ చెన్నైతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరుపుకోనుంది.



కొత్త చిత్రం పూజా దృశ్యం

యువత కలల రాణిగా భవ్య త్రిఖ



కోలీవుడ్ యంగ్ హీరోయిన్లలో భవ్య త్రిఖ యువత కలలరాణిగా మారిపోయారు. ఆమె 'జో' అనే చిత్రంలో శ్రుతి అనే పాత్రలో నటించి ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. చెన్నైలో పుట్టి పెరిగిన ఈ పంజాబీ యువతి.. తమిళంలో అనర్గళంగా మాట్లాడటం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నటనపై మక్కువతో తన చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా డిజిటల్ మార్కెటింగ్ కోర్సును పూర్తి చేశారు. ప్రస్తుతం కోలీవుడ్‌లో తన సినీ కెరీర్ గురించి ప్రస్తావిస్తూ... 'చిన్న వయసు నుంచే నటించాలన్న ఆశ ఉంది. ఈ విషయంలో నాన్న ఎంతో మద్దతు తెలిపారు. అనేక సినిమాలు చూసి తమిళంతో పాటు సినిమాల్లోని సారాంశాన్ని అర్థం చేసుకున్నా. సినిమా అవకాశాల కోసం ఎదురు చూస్తున్న సమయంలో 'కదిర్' సినిమాలో అవకాశం వచ్చింది. ఆ తర్వాత కాలేజీలో నా స్నేహితులు ప్రోత్సహించడంతో 'జో'లో నటించాను. ఈ సినిమా ఊహించని విజయం సాధించడంతో ఎంతో ఆనందంగా ఉంది. కొత్త సంవత్సరంలో మంచి నటిగా గుర్తింపు పొందుతానన్న నమ్మకం ఉంది' అని అన్నారు.



సోషల్ మీడియాతో జర జాగ్రత్త

● హీరో ధనుష్

సోషల్ మీడియా ప్రతి ఒక్కరి సమయాన్ని వృథా చేసే దొంగ వంటిదని (థీఫ్ ఆఫ్ టైం), దాంతో జాగ్రత్తగా ఉండాలని హీరో ధనుష్ పిలుపునిచ్చారు. తాను హీరోగా నటించిన కొత్త చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. ఈనెల 12వ తేదీన సంక్రాంతిని పురస్కరించుకుని విడుదల చేయనున్నారు. ఈ చిత్ర ఆడియో, ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు. ఇందులో ధనుష్ మాట్లాడుతూ... 'సోషల్ మీడియా మీకు తెలియకుండానే మీ సమయాన్ని వృథా చేస్తుంది. నలుగురు వ్యక్తులు ఒక చోట చేరినపుడు ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ మాట్లాడుకోవడం మంచిది. అంతేకానీ, మొబైళ్లు చూస్తూ మాట్లాడొద్దు. మున్ముందు ప్రతి ఒక్క విషయాన్ని సోషల్ మీడియా వేదికగానే తెలుసుకునే పరిస్థితి వస్తుంది. ప్రతిదాన్ని మితంగా ఉపయోగిస్తేనే ప్రతి ఒక్కరికీ మంచిది' అన్నారు. సీనియర్ నటుడు కెప్టెన్ విజయకాంత్ మృతికి ధనుష్ తనదైనశైలిలో సంతాపం తెలిపారు. విజయకాంత్ నటించిన 'వైదేహి' చిత్రంలోని 'రాసావే ఉన్ కాణాద నెంజు' అనే పాటను స్వయంగా గానం చేసి తన నివాళి అర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ మాట్లాడుతూ... 'గతంలో రెండు కథలు సిద్ధం చేసి ధనుష్‌ను డైరెక్ట్ చేసేందుకు ప్రయత్నించాను. అది సాధ్యపడలేదు. మూడోసారి ఈ అవకాశం వచ్చింది. ఈ స్టోరీ విన్న వెంటనే ఒకే చెప్పారు. నాకు ఈ ప్రాజెక్టు అప్పగించిన నిర్మాతకు ధన్యవాదాలు. ధనుష్ చిత్రం అనగానే కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ మరోమాట చెప్పకుండా ఒకే చెప్పేశారు' అన్నారు. ఈ వేడుకలో పాల్గొన్న నటుడు వినోద్ కృష్ణన్, హీరోయిన్లు ప్రియాంక అరుళ్ మోహన్, నివేదిత సతీష్, నటులు జయప్రకాష్, కాళి, ఎడ్వర్డ్, మాస్టర్ దిలీప్ సుబ్బరాయన్, దర్శకుడు మారి సెల్వరాజ్, నిర్మాత ధనుంజయన్, సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్, నటుడు సందీప్ కిషన్, సత్యజ్యోతి ఫిలిమ్స్ అధినేత టీజీ త్యాగరాజన్ తదితరులు ప్రసంగించారు. కాగా, సత్యజ్యోతి ఫిలిమ్స్ బ్యానరుపై తెరకెక్కించిన ఈ చిత్రంలో ధనుష్, ప్రియాంక అరుళ్ మోహన్, నివేదిత సతీష్, శివరాజ్ కుమార్, సందీప్ కిషన్ తదితరులు నటించారు. సంగీతం జీవీ ప్రకాష్, దర్శకత్వం అరుణ్ మాథేశ్వరన్.



గురుపూజా మహోత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులు

వైభవంగా జగన్మాత ఈశ్వరి దేవి
గురుపూజా మహోత్సవం

ప్యారీస్, జనవరి 5: పరబ్రహ్మ స్వరూపి, కాలజ్ఞానం రచించిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి మనవరాలు, జగన్మాత ఈశ్వరి మహాదేవి ఆరాధన గురుపూజ మహోత్సవాన్ని నగరంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పరమేశ్వరి స్వరూపిణి ఈశ్వరి దేవి సజీవ సమాధి అయిన రోజును పురస్కరించుకొని స్థానిక కొళత్తూర్‌లో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమంలో ఆశ్రమ ట్రస్టీలు తాతోలు వీరభద్రరావు, నూతక్కి కిషోర్, కాశి సీతారామశర్మ సారథ్యంలో, ముందుగా వీరబ్రహ్మేంద్ర స్వామికి మహా హారతి పూజ నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఈశ్వరి దేవి చిత్రపటాన్ని పూలతో అలంకరించారు. 108 మంది ముత్తయిదువులు అమ్మవారిని కీర్తిస్తూ సామూహిక దీప పూజలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

ఐఐఎల్ ఎండీ డాక్టర్ కే ఆనంద్‌కుమార్‌కు రోటరీక్లబ్ ప్రతిష్ఠాత్మక అవార్డు



డాక్టర్ కే ఆనంద్‌కుమార్‌కు అవార్డును ప్రదానం చేస్తున్న రోటరీక్లబ్ ఆఫ్ పొల్లాచ్చి నిర్వాహకులు

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): టీకాల తయారీలో పేరు గడించిన ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే ఆనంద్‌కుమార్‌కు 2023-24 సంవత్సరానికిగాను 'వొకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు' లభించింది. రోటరీ క్లబ్ ఆఫ్ పొల్లాచ్చి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఈ అవార్డుతో ఘనంగా సత్కరించారు. గతంలో ఇస్రో సంస్థ నిర్వాహకులు డాక్టర్ కే శివన్, డాక్టర్ మయిల్‌సామి అన్నాదురై ఈ అవార్డులు అందుకున్నారు. మూడు దశాబ్దాలకు పైగా వ్యాక్సిన్‌ల తయారీపై పరిశోధనలు నిర్వహించి వాటిని ఉత్పత్తి చేయడంలో డాక్టర్ ఆనంద్‌కుమార్ కీలకపాత్రను పోషిస్తున్నారు. అవార్డు గ్రహీత మాట్లాడుతూ... వ్యాక్సిన్ రంగంలో తన కృషిని గుర్తించి ప్రతిష్ఠాత్మక రోటరీక్లబ్ ఘనంగా సత్కరించడం తనకెంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ అవార్డు దేశంలో వ్యాధి నియంత్రణలో తన బాధ్యతలను మరింత పెంచుతుందన్నారు.

వరద సహాయ నిధులు అందించనున్నట్లు ప్రధాని హామీ

● మంత్రి ఉదయనిధి స్టాలిన్

ప్యారీస్, జనవరి 5: రాష్ట్రంలో జరిగిన వరద నష్టాన్ని భర్తీచేసేలా సహాయ నిధులను అందించనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తనకు హామీ ఇచ్చారని యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని తో భేటీ అయిన అనంతరం మంత్రి ఉదయనిధి విమానం ద్వారా గురువారం రాత్రి 11.30 గంటలకు చెన్నైకి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రప్రభుత్వం తరఫున సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రతిష్ఠాత్మకంగా 'ఖేలో ఇండియా' క్రీడా పోటీలు ఈనెల 19వ తేది నుంచి జరుగుతాయని, ఈ పోటీలు ప్రారంభించాల్సిందిగా ప్రధాని మోదీని నేరుగా వెళ్లి కలుసుకొని ఆహ్వానించినట్లు తెలిపారు. ఆ సమయంలో తూత్తుకుడి, తిరునల్వేలి, చెన్నై, కాంచీపురం, తిరువళ్లూర్, చెంగల్పట్టు జిల్లాల్లో "వరద నష్టాల వివరాలను ప్రధానికి మళ్లీ గుర్తుచేశానని, అందుకు ప్రధాని సానుకూలంగా స్పందించి కేంద్రప్రభుత్వం తరఫున వరద సహాయ నిధులు అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఢిల్లీలో తాను మర్యాదపూర్వకంగా ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని సంప్రదించి 10 నిమిషాలు మాట్లాడుకున్నామని, ఆయన చేపట్టనున్న మణిపూర్ పాదయాత్ర విజయవంతం కావాలని రాష్ట్రం తరఫున శుభాకాంక్షలు తెలియజేసినట్లు ఉదయనిధి పేర్కొన్నారు.

కెప్టెన్ సమాధి వద్ద హీరో సూర్య కన్నీరు

● కుటుంబ సభ్యులకు ఓదార్పు

అడయార్, జనవరి 5: సీనియర్ నటుడు, డీఎండీకే అధ్యక్షుడు దివంగత కెప్టెన్ విజయకాంత్ సమాధికి హీరో సూర్య కన్నీటితో నివాళి అర్పించారు. విజయకాంత్ చనిపోయిన సమయంలో ఆయన విదేశాల్లో ఉన్నారు. దీంతో కెప్టెన్ పార్థివదేహానికి చివరిసారి చూసి నివాళి అర్పించలేకపోయారు. శుక్రవారం విదేశాల నుంచి చెన్నైకి తిరిగి వచ్చిన ఆయన.. స్థానిక కోయంబేడులోని డీఎండీకే ప్రధాన కార్యాలయంలో ఉన్న కెప్టెన్ సమాధి వద్దకు వెళ్లి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. కన్నీరు కారుస్తూనే కెప్టెన్ సమాధికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆ తర్వాత సమాధి వద్ద కూర్చొని రోదించారు. పిమ్మట.. తన తండ్రి శివకుమార్, తమ్ముడు కార్తీతో కలిసి సాలిగ్రామంలోని కెప్టెన్ నివాసానికి వెళ్లి విజయకాంత్ చిత్రపటానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కెప్టెన్ విజయకాంత్ సమాధికి హీరో సూర్య కన్నీటి నివాళి

